



లంకలగన్నవరం వద్ద మాక్‌ఎక్సర్‌సైజ్‌లో భాగంగా గోదావరిలో మునిగిన బోటు కోసం రెస్క్యూ ఆపరేషన్

విపత్తుల సమయంలో... సామాజిక అవగాహన అవసరం

- ఎన్డీఆర్ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్.. జిల్లాలో మాక్ ఎక్సర్‌సైజ్‌లు

6

1.34 లక్షల మంది రైతులకు రూ.90.59 కోట్లు

- నేడు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల
- నేరుగా అన్నదాతల ఖాతాలకు జమకానున్న ప్రభుత్వ సహాయం
- హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్న కోనసీమ జిల్లా అన్నదాతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అన్నదాతలకు శుభవార్త. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.7 వేలను వారి బ్యాంకు ఖాతాలకు బుధవారం జమచేయనున్నాయి. రెం డో విడతలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం, పీఎం కిసాన్ రైతు పథకం కింద జిల్లాలో 1,34,439 మంది రైతులకు మొత్తం రూ.90.59 కోట్ల ఆర్థిక ప్రయోజనాన్ని అందించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తమిళనాడులోని కోయంబత్తూరులో పీఎం కిసాన్ పథకం కింద నిధులను విడుదల చేయనున్నారు. సీఎం చంద్రబాబునాయుడు వైఎస్సార్ జిల్లాలోని కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ నిధులు విడుదల చేయనున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,34,439 మంది రైతులు ఉండగా, వారికి సీఎం అందించే అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.67.22 కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద 1,16,852 మంది రైతులకు రూ.23.37 కోట్లు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో ఖరీఫ్ సేద్యం చేస్తున్న రైతులకు కొంత మేర ఇబ్బందులు తొలగిపోతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్ఎస్కేల స్థాయిలోనూ కార్యక్రమాలు : జేసీ

సూపర్-6 కార్యక్రమాల అమలులో భాగంగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద ప్రభుత్వం ప్రతీ రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20వేల ఆర్థికసాయం ప్రకటించిందని జాయింట్ కలెక్టర్ నిషాంతి పేర్కొన్నారు. సాగు భూమిని సమష్టిగా కలిగి ఉన్న భూస్వామి కుటుంబాలకు సంవత్సరానికి రూ.20 వేల వంతున ఈ నిధులు అందజేయడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో 1.34 లక్షల మంది రైతులకు రూ.90.59 కోట్లు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 1గంట నుంచి 4 గంటల వరకు జిల్లాస్థాయి నుంచి ఆర్ఎస్కే స్థాయి వరకు కార్యక్రమాలు నిర్వహించాలని జేసీ సూచించారు. ముమ్మిడివరం నియోజకవర్గస్థాయి కార్యక్రమం ఐ.పోలవరం ఎంపీడీవో కార్యాలయం, పి.గన్నవరం నియోజకవర్గ కార్యక్రమం అయినవిల్లి ఎంపీడీవో కార్యాలయంలో, మండపేట నియోజకవర్గ కార్యక్రమం రాయవరంలోని కంటిపూడి సీతారత్నంకల్యాణ మండపంలో, రామచంద్రపురం నియోజకవర్గ కార్యక్రమం కె.గంగవరం ఎంపీడీవో కార్యాలయంలో, రాజోలు నియోజకవర్గ కార్యక్రమం మామిడికుదురు మండలం కరవాక గ్రామ పంచాయతీ ఆవరణలో, కొత్తపేట నియోజకవర్గ కార్యక్రమం కొత్తపేట ఎంపీడీవో కార్యాలయంలో, అమలాపురం నియోజకవర్గ కార్యక్రమం ఎర్రవంతెన వద్ద పళ్లవెంకన్నావు కొబ్బరి సంఘం కార్యాలయంలో జరుగుతాయని తెలిపారు.






అడవిలో కలిసిన.. ఆరో ప్రాణం!

ఆరుగురు మావోల ఎన్‌కౌంటర్

ఉమ్మడి జిల్లాలో ఉలికిపాటు



రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద భద్రతా బలగాలు

రాజమండ్రికి 100కి.మీ

ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ఉనికి లేదనుకున్న తరుణంలో ఒక్కసారిగా భారీ సంఘటన కలకలం రేపింది. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందడం.. అందులో ఒకరు మూడు రాష్ట్రాలు, కేంద్రం హిట్‌లిస్ట్‌లో ఉన్న మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు హిడ్మా కావడం పెను సంచలనంగా మారింది. అసలు మావోల జాడే లేదనుకున్న మారేడుమిల్లిలో ఏకంగా మావోయిస్టు అగ్రనేత తలదాచుకోవడం.. ఎన్‌కౌంటర్‌లో ఆయనతో పాటు మరో ఆరుగురు మరణించడం కలకలం రేపింది. రాజమహేంద్రవరం నుంచి ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం వంద కిలోమీటర్లే కావడంతో విషయం తెలిసి ఉమ్మడి జిల్లా ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మారేడుమిల్లి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల లోపే ఉండడం గమనార్హం. అదే సమయంలో ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడలో ఇద్దరు మహిళా మావోయిస్టులు పట్టుబడడం, వీరు హిడ్మా గన్‌మెన్‌లు కావడంతో ఉమ్మడి జిల్లా ఒకేరోజు రెండు ఉలిక్కిపడే ఘటనలతో వణికింది.

అడవిలో మావోయిస్టుల ఆరో ప్రాణం కలిసిపోయింది. ఉమ్మడి జిల్లా వణికింది.. మారేడుమిల్లి పేరు మళ్లీ మార్మోగింది.. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ తూటాలు పేలాయి.. ఆరుగురు మావోయిస్టుల ప్రాణాలు గాలిలో కలిశాయి.. పచ్చని చెట్లపై రక్తపు మరకలు పడ్డాయి. చాలా ఏళ్ల కిందట మారేడుమిల్లి అడవులకు వెళ్లాలంటే భయపడేవారు. అటువంటిది మావోయిస్టుల ప్రాభవం తగ్గింది.. దీంతో ఇప్పుడిప్పుడే అడవి అందాలు ఆస్వాదించేందుకు ఏజెన్సీ బాట పడుతున్నారు.. ఆరుగురు మావోల ఎన్‌కౌంటర్‌తో మళ్లీ భయం పెరిగింది.

- (కాకినాడ/మారేడుమిల్లి/రంపచోడవరం-ఆంధ్రజ్యోతి)

మారేడుమిల్లి ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. పర్యాటకులు ప్రకృతి అందాలు తిలకించేందుకు పోటెత్తుతుంటారు. అయితే ఉన్నట్టుండి ఒక్కసారిగా మంగళవారం ఉదయం ఆరున్నర గంటల సమయంలో తుపాకీ మోతలు.. బుల్లెట్ల శబ్దాలతో ఏం జరుగుతుందో తెలియని భయం నెలకొంది. కానీ ఆ తర్వాత కాసేపటికే ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఉలిక్కిపడింది.

- మారేడుమిల్లిలో ఘటన
- గత కొన్నేళ్లుగా కానరాని జాడ
- తాజా ఎన్‌కౌంటర్‌తో అలజడి
- పోలీసుల ముమ్మర కూంబింగ్
- రంపచోడవరానికి మృతదేహాలు
- సామర్లకోటలో చిక్కిన మావోలు
- వీరిద్దరు హిడ్మా లేడీ గన్‌మెన్లు?

హిడ్మా ఇక్కడకెందుకొచ్చాడు చెప్మా?



మోస్ట్‌వాంటెడ్.. 26 కేసుల్లో నిందితుడిగా ఉన్న మావోయిస్టు హిడ్మా మారేడుమిల్లి అడవులకు రావడమేంటనే ప్రశ్న మొదలైంది. ఎక్కడో ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం అడవుల నుంచి తూర్పు కనుమల్లోని మారేడుమిల్లి అడవులకు రావడం చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టు అగ్రనేత మారేడుమిల్లి అడవుల్లో సంచరించడం సంచలనం సృష్టించింది. మరోపక్క కాకినాడకు సమీపంలోని సామర్లకోట మండలం కొప్పవరంలో మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేయడం కలకలం రేపింది. వీరిద్దరు చనిపోయిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా గన్‌మెన్‌లుగా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. వీరు కొప్పవరం వద్ద రహదారి దాటుతుండగా పోలీసులకు చిక్కారు.

20 ఏళ్ల కిందట ఒకటి..

ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో మారేడుమిల్లి, వై.రామవరం అడవుల్లో మావోయిస్టుల ప్రాబల్యం ఉండేది. 1987 డిసెంబరు 27న ఏడుగురు ఐఏఎస్ అధికారులను మావోయిస్టులు వై.రామవరంలోని గుర్తేడు అడవుల్లో కిడ్నాప్ చేసిన ఘటన సంచలనంగా మారింది. ఆ తర్వాత మారేడుమిల్లి, వై.రామవరం అడవుల్లో వరుసగా మావోయిస్టులు పలువురిని చంపడం, వరుస కూంబింగ్‌లలో మావోయిస్టులు మరణించడం జరిగేవి. అయితే గడచిన కొన్ని దశాబ్దాలుగా మారేడుమిల్లిలో మావోయిస్టుల జాడే లేదు. మళ్లీ కొన్ని దశాబ్దాల తర్వాత మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరగడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. ప్రస్తుతం ఎన్‌కౌంటర్ జరిగిన చోటుకు అతి సమీపంలో 20 ఏళ్ల కిందట ఓ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

అడవిని వదిలేసిన మావోలు..

ఛత్తీస్‌గఢ్ నుంచి ఆంధ్రా ప్రాంతంలోని పలు నగరాల్లోకి మావోయిస్టులు పెద్దఎత్తున చొరబడ్డారనే విషయం సంచలనంగా మారింది. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టులకు తగులుతున్న వరుస ఎదురుదెబ్బలతో అక్కడ మనుగడ సాగించలేని పరిస్థితుల్లోనే మావోలు మన ఏజెన్సీని సురక్షిత ప్రాంతంగా ఎన్నుకోవడంతోపాటు ఇక్కడి నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారన్న సమాచారం హడలెత్తిస్తోంది. దీంతో ఆంధ్రాలోకి చొరబడే మార్గాల వెంబడి నిఘాను పెంచి వారి కదలికలను భద్రతా దళాలు గుర్తించినట్టు చెబుతున్నారు. ప్రస్తుతం అడవుల్లో ప్రత్యేక బలగాలతో కూంబింగ్‌లతోనూ, నగరాల్లో ఆక్టోపస్ బలగాలతోనూ పోలీసులు గాలిస్తున్నారు. మావోల కదలికలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అల్లూరి జిల్లా షెల్టర్ జోన్ కానివ్వం



అల్లూరి సీతారామరాజు జిల్లాను మావోయిస్టులకు షెల్టర్‌జోన్ కానివ్వం. ఏపీ సరిహద్దు రాష్ట్రాల్లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల్లో మావోయిస్టులు అల్లూరి జిల్లాను షెల్టర్ జోన్ చేసుకుని మనుగడ సాధిద్దామనుకుని ఇక్కడకు చొరబడితే తగిన గుణపాఠం చెబుతాం. మావోయిస్టులు ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయారు. వారిని భయపెట్టి ఉద్యమాన్ని సాగించాలనుకున్నా ఎవరూ భయపడడం లేదు. ప్రజల్లో వారికి పెరిగిన వ్యతిరేకతే వారి అంతానికి కారణం. ఇకనైనా ఉద్యమాన్ని వీడి జన జీవన స్రవంతిలో కలవాలనుకునే మావోయిస్టులకు తాము స్వాగతం పలుకుతాం. - **అమిత్ బర్దర్, ఎస్పీ**

7 నెలలు.. 3 ఎన్‌కౌంటర్లు

(చింతూరు - ఆంధ్రజ్యోతి)

రంపచోడవరం ఏజెన్సీలో ఈ ఏడాది గడచిన ఏడు నెలల్లో మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయి. 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి, వై.రామవరం మండలాల అడవుల్లో ఇటీవల వరుస ఎన్‌కౌంటర్లతో ఆందోళన నెలకొంది. రంపచోడవరం అడవుల్లో గత దశాబ్దకాలంగా చెప్పుకోదగ్గ ఘటనలేమీ లేవు. ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు.వారిలో ఆంధ్ర ఒడిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు టకూరి పండన్న అలియాస్ జగన్, ఏవోబీ డివిజన్ కమిటీ సభ్యుడు రమేష్ ఉన్నారు. జూన్‌లో మారేడుమిల్లి మండలం కింటు కుర్రు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో మావో యిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి, అలియాస్ ఉదయ్, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య రావి వెంకట చైతన్య, కొవ్వాసి అంజు అలియాస్ మాసే ఉన్నారు. ఇక మంగళవారం మారేడుమిల్లి మండలం జీఎం వలస పంచాయతీలోని నెల్లూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, సౌత్ బస్తర్ బెటాలియన్ నాయకుడు హిడ్మా అలియాస్ సంతోష్, అతడి భార్య రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాజే అలియాస్ రాజక్క, దేవె, లఖాల్ అలియాస్ చైతు, మల్ల అలియాస్ మల్లాలు, కమ్లు కమలేష్ ఉన్నారు. ఇంతవరకూ జరిగిన ఎన్‌కౌంటర్లలో మృతిచెందిన వారంతా ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దు క్యాడర్ వారే. తాజా ఎన్‌కౌంటర్లో మృతి చెందింది మాత్రం ఛత్తీస్‌గఢ్ క్యాడర్ కావడం విశేషం.



శిరిగినీడి దుర్గాప్రసాద్, మోహిత్, జాహ్నవి

బిడ్డలతో సహా గోదాట్లో దూకేశాడు!

- చించినాడ బ్రిడ్జిపై నుంచి దూకి అఘాయిత్యం
- తండ్రి, కుమారుడి మృతదేహాలు లభ్యం
- బాలిక ఆచూకీ కోసం గాలింపు
- లక్కవరంలో అలుముకున్న విషాదచాయలు

6

వైభవంగా కార్తీక దీపారాధన

- ప్రసన్నాంజనేయుడికి వేదమంత్రాలతో పూజలు
- అలరించిన సినీ సంగీత విభావరి

6



పాశర్లపూడి వద్ద వైనతేయ గోదావరిలో పడవపై ప్రయాణించి నదీకోతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

నదీకోత నివారణకు ప్రత్యేక చర్యలు

మామిడికుదురు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీ తీరంలో నదీకోత నివారణకు, ఏటిగట్ల పటిష్టానికి ప్రత్యేక కృషి చేస్తామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి తెలియజేశారు. మంగళవారం ఎమ్మెల్యే, ఎంపీలు పాశర్లపూడి నుంచి ఆదుర్రు వరకు వైనతేయ నదిలో పడవపై ప్రయాణికి తీర ప్రాంతంలో నదీకోతకు గురవుతున్న భూములు, ఏటిగట్లను పరిశీలించారు. స్థానిక రైతులను అడిగి నదీకోత గురించి తెలుసుకున్నారు. విలువైన భూములు నదీగర్భంలో కలిసిపోతున్నాయని, రైతులు వారి దృష్టికి తేవడంతో ఎంపీ, ఎమ్మెల్యేలు ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన నిధులు తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నదీకోత నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేస్తామని తెలిపారు. అలాగే వైనతేయ నదీ తీరంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన అతిథి గృహాలను ఆధునికీకరించి పర్యాటకాన్ని అభివృద్ధిపరుస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మద్దాల కృష్ణమూర్తి, బోనం బాబు, మల్లాడి విష్ణు, చుట్టుగుళ్ల కిశోర్, చొల్లంగి అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.



సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంటుకు అనువైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంటుకు స్థల పరిశీలన

ముమ్మిడివరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని మురుగునీటిని శుద్ధిచేసి ఆ నీటిని పంట అవసరాలకు వినియోగించుకునేలా తీసేందుకు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సేకరించేందుకు అమలాపురం ఆర్డీవో కె.మాధవి మంగళవారం భూమిని పరిశీలించారు. ముమ్మిడివరం పంచాయతీ పరిధిలోని చింతలమెరక సమీపంలో రెండెకరాల భూమిని రెవెన్యూ అధికారులు ఎంపిక చేయగా, ఆ స్థలాన్ని ఆర్డీవో మాధవి మంగళవారం పరిశీలించారు. ప్రజలు వినియోగించిన మురుగునీటిని బయటకు వదిలివేయడంతో పంట కాల్వలు కలుషితం కాకుండా ప్లాంటు ద్వారా నీటిని శుద్ధిచేసి వదులుతారు. సీడీఎంఏ, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నిధులు మంజూరుకావడంతో ఈ ప్లాంటు నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగానే స్థల సేకరణ చేపట్టారు. తహశీల్దార్ టి.సుభాష్, కమిషనర్ పి.రవివర్మను ప్లాంటుకు ఏర్పాటుకు భూమి వివరాలు ఆర్డీవో అడిగితెలుసుకున్నారు. ఆమె వెంట డిప్యూటీ తహశీల్దార్ బి.గోపాలకృష్ణ, సర్వేయర్ ప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

శబరిమల స్వాములకు 20 ప్రత్యేక రైళ్లు

6



సూర్యుడి.. శుభోదయం!

మంచు తెరల మాటు నుంచి సూర్యుడు ఉదయించాడు. శుభోదయం అంటూ గిరిసీమను మురిపించాడు. అల్లూరి జిల్లా చింతూరు శబరి నది పక్కన రహదారిని ఆనుకుని ఉన్న పొలాల్లో మంగళవారం ఉదయం 6.30 గంటల సమయంలో కనిపించిన సూర్యోదయం చిత్రాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- చింతూరు (ఆంధ్రజ్యోతి)



విపత్తుల సమయంలో...
సామాజిక అవగాహన అవసరం



లంకలగన్నవరం మాక్‌ఎక్సర్‌సైజ్‌లో మాట్లాడుతున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్

- ఎన్‌డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్
- జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఐదురోజులు మాక్ ఎక్సర్‌సైజ్‌లు

పి.గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విపత్తులు సంభవించినప్పుడు ప్రతి వ్యక్తి అతడితో పాటు ఇతరులను సైతం రక్షించుకోవడానికి సామాజిక అవగాహన కలిగి ఉండాలని ఎన్డీఆర్‌ఎఫ్ పదో బెటాలియన్ కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్ సూచించారు. మంగళవారం లంకలగన్నవరంలో ముఖ్యంగా విపత్తులు సంభవించినప్పుడు ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలతో పాటు రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది సేవలందిస్తారని తెలిపారు. గోదావరి వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు సంభవించినప్పుడు మనల్ని మనం కాపాడుకోవాలని అనే అంశాలపై మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు ఆయన చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఐదు రోజుల పాటు మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా స్థానిక ప్రజానీకానికి అవగాహన కల్పించడం జరుగు తుందన్నారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా 10 పాఠశాలల్లో విద్యార్థులకు స్కూల్ సేఫ్టీ ప్రోగ్రామ్‌లు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ టీమ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర కుమార్ సరోజ్, ఎస్‌ఐ బి.శివకృష్ణ, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఫైర్ ఎస్‌ఐ పి.శ్రీనివాస్, సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని, ఎంపీటీసీ అవనిగడ్డ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాక్‌ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సీపీఆర్ చేస్తున్న దృశ్యం

- ఆకట్టుకున్న మాక్ ఎక్సర్‌సైజ్ విన్యాసాలు

మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా కమాండెంట్ దిల్‌బాగ్‌సింగ్, టీమ్ కమాండర్ రాజేంద్ర కుమార్‌సరోజ్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది చేసిన విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తొలుత గోదావరి వరదల సమయంలో బోటు తిరగబడితే ఎలా రక్షించాలో చూపించారు. ముఖ్యంగా గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చెయ్యాలో కళ్లకు కట్టినట్టు వివరించారు. అనంతరం గోదావరి వరదల సమయంలో భారీగా నీరు పోటెత్తినప్పుడు మన చుట్టు ఉన్న (ప్లాస్టిక్ బాటిళ్లు, ఎండి కొబ్బరికాయలు, ఇనుప డబ్బాలు, తదితర వస్తువులు) వస్తువులతో మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో గోదావరి నదిలో చేసి చూపించారు.

రచనలో మణిమకుటం



- డిజిటల్ ఇండియాలో కాగ్ పాత్రపై విశ్లేషణాత్మక వ్యాసం
- జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి, రూ.30వేలు నగదు బహుమతి అందుకున్న మణిశ్రీ

అమలాపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియాలో కాగ్ పాత్రపై ఇంజనీరింగ్ విద్యార్థిని విత్తనాల మణిశ్రీ అద్భుత విశ్లేషణ చేసి జాతీయ స్థాయిలోమెరిసింది. జాతీయ, అంతర్జాతీయ ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాడ్ అండ్ ఎంఎల్ ఇంజనీరింగ్ విభాగంలోమణిశ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ ఏడాది అక్టోబరులో మై భారత్ పోర్టల్ ద్వారా భారత రాజ్యాంగ నియంత్రణ-లెక్కల పరిశీలనాధికారి (కాగ్) కార్యాలయం ఆధ్వర్యంలో ఆడిట్ దివస్-2025 సందర్భంగా నిర్వహించిన జాతీయస్థాయి ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలో పాల్గొంది. ఆమె విశ్లేషణాత్మక వ్యాసం జాతీయ స్థాయిలో తృతీయ స్థానం దక్కించుకున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు తెలిపారు. మణిశ్రీ రచనలో స్పష్టత, విశ్లేషణాత్మక విధానం, పారదర్శకత-డిజిటల్ పాలనపై సునిశితమైన అవగాహన ప్రతిబింబించాయని జాతీయ నిర్వాహకులు కొనియాడారు.న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఆడిట్ దివస్‌లో మణిశ్రీకి రూ.30వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రాన్ని కాగ్ పరిశీలనాధికారి కె.సునయ్‌మూర్తి అందజేశారు. మణిశ్రీని ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు, చైర్మన్ బోనం కృష్ణసతీష్, క్యాడ్ అండ్ ఎంఎల్ విభాగాధిపతి జి.విజయకుమారి, అధ్యాపకులు, సహచర విద్యార్థులు ప్రత్యేకంగా అభినందించారు.



న్యూఢిల్లీలో నగదు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రం అందుకుంటున్న మణిశ్రీ

రాష్ట్ర వాలీబాల్, టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

ఉప్పలగుప్తం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం మునిపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థినులు సీహెచ్ హెప్సీబా, ఎం.కావ్యశ్రీ, ఎం.పావని అండర్-14 వాలీబాల్ విభాగంలో సత్తా చాటారు. ఈ మేరకు మంగళవారం ఆ పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటసుబ్బారావు మాట్లాడుతూ వీరంతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. ఈనెల 22 నుంచి 24 వరకు నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, పీడీ నూకల సీతాపతి, గ్రామపెద్దలు అభినందించారు.

దేవరపల్లి: దేవరపల్లి మండలంలోని రామన్నపాలెం హైస్కూల్‌లో టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సబ్ జూనియర్ స్థాయి బాలబాలికల సెలక్షన్స్ జరిగాయి. ఇందులో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 21,22 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా సోండిపూడిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. టెన్నికాయిట్‌కు ఎం.ప్రియదర్శిని, షేక్ లతిపా, ఆర్. శౌరిక, ఎం. లోహితశ్రీ, పీ.అక్షయ, బాలురు జీ.బాబి, వై.ఈశ్వర్, చిన్నబాబు, ఆకాశ్, ఎంపికయ్యారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు గద్దే చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి ఏవీఆర్ సరస్వతి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలకు ఎంపికైన మునిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు



రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్‌కు ఎంపికైన విద్యార్థులు

సినీ నటి హేమకు మాతృవియోగం



తల్లి భౌతికకాయం వద్ద విలపిస్తున్న హేమ

రాజోలు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటి హేమకు మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి కోళ్ల లక్ష్మి (80) రాజోలులో సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. ఈమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తల్లి లక్ష్మి మరణ వార్త తెలియగానే హైదరాబాద్ నుంచి హుటాహుటిన హేమ బయలుదేరి రాజోలు చేరుకున్నారు. సోంపల్లిలో లక్ష్మి అంత్యక్రియలు జరిగాయి. లక్ష్మికి కుమార్తె హేమ, కుమారుడు లక్ష్మీ ప్యాషన్ స్టూడియో అధినేత శ్రీనివాస్ ఉన్నారు. హేమను పలువురు పరామర్శించి సంతాపం తెలిపారు.

శిఖామణికి సప్పా ఎక్స్ లెన్స్ అవార్డ్-2025

యానాం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ నాట్య గురువు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏటా ఇచ్చే సప్పా ఎక్స్‌లెన్స్ అవార్డ్- 2025కు సాహిత్య విభాగంలో యానాంకు చెందిన ప్రముఖ కవి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు, కవి సంధ్యా సంపాదకుడు, కళారత్న డాక్టర్ శిఖామణి ఎంపికయ్యారు. ఈనెల 23 వ తేదీ ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరంలోని తాడితోటలో గల సంహిత కన్వెన్షన్ హాలులో అవార్డుల ప్రదానోత్సవ సభ జరగనుంది. సాహిత్య, కళా, సామాజిక, తదితర రంగాలలో వంశీ నివాస్, పొత్తూరి సుబ్బారావు, హేమ సుందర్ వంటి 15 మంది ప్రముఖులున్నారు. సభలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, మండలి బుద్ధప్రసాద్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జీవీ హర్షకుమార్, తెలుగు విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య డి.మునిరత్నం నాయుడు, తదితరులు పాల్గొననున్నారు. డాక్టర్ శిఖామణికి అవార్డు ప్రకటించడం పట్ల పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, దాట్ల దేవదానంరాజు, డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, మధునాపంతుల సత్యనారాయణ మూర్తి, పోనుగుమట్ల విష్ణుమూర్తి, ముమ్మిడి చిన్నారి, సీహెచ్ రాం, రవి, పోనుగుమట్ల అశోక్, తదితరులు అభినందనలు తెలిపారు.



శిఖామణి

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

సీతానగరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) బాలికపై అత్యాచారానికి పాల్పడిన సీతానగరం మండలం రఘుదేవపురం గ్రామానికి చెందిన గుడుసుల నాగ వెంకటేష్‌కు రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ డి.రామ్ కుమార్ తెలిపారు. ఇంటర్మీడియట్ చదివి విశాఖపట్నంలో ఎయిర్ హోస్టెస్‌గా శిక్షణ పొందుతున్న బాలికను వాట్సాప్ ద్వారా వెంకటేష్ పరిచయం చేసుకున్నాడు. ఇంటర్వ్యూ ఉందని తల్లిదండ్రులకు చెప్పి రమ్మనడంతో ఆమె అలాగే ఇంటి వద్ద చెప్పి వచ్చింది. ఇద్దరు గత నెల 31 నుంచి హోటల్లో గడిపారు. దగ్గరకు రాకపోతే మనమిద్దరం తీసుకున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వెళ్లాక విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెంకటేష్ ఇంటికి వెళ్లగా వెంకటేష్ తల్లి వారిని కులంపేరుతో దూషిస్తూ దుర్భాషలాడింది. దీంతో ఈ నెల 16న బాలిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంకటేష్‌తో పాటు అతడి తల్లిపై కేసు నమోదు చేశారు.నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ సోమవారం సాయంత్రం 6గంటలకు రఘుదేవపురం సెంటర్‌లో వెంకటేష్‌ను అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బిడ్డలతో సహా దూకేశాడు!

- చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి తండ్రి అఘాయిత్యం
- ఇద్దరి మృతదేహాలు లభ్యం.. బాలిక ఆచూకీ కోసం గాలింపు
- లక్కవరంలో విషాదచాయలు

మలికిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఓ తండ్రి తన ఇద్దరు బిడ్డలతో కలిసి చించినాడ బ్రిడ్జిపైనుంచి గోదావరిలోకి దూకేశాడు. వీరిలో ఇద్దరి మృతదేహాలు లభ్యం కాగా బాలిక మృతదేహంకోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మలికిపురం మండలం లక్కవరానికి చెందిన శిరిగినీడి దుర్గాప్రసాద్(39) తన కుమారుడు మోహిత్(14), కుమార్తె జాహ్నవి(9)లతో సహా సోమవారం రాత్రి దిండి-చించినాడ వశిష్ట వారధిపైనుంచి గోదావరిలోకి దూకాడు. ముందుగా వంతెనపై తన మోటారుసైకిల్, సెల్‌ఫోన్, ఆధార్‌కార్డులను చెప్పులు వదిలేశారు. దుర్గాప్రసాద్ తన భార్య నాగవేణి, పిల్లలతో కలసి వారంరోజులుగా విశ్వేశ్వరాయపురంలోని అత్తవారింట్లో ఉంటున్నాడు. 8వ తరగతి చదువుతున్న మోహిత్, 4వ తరగతి చదువుతున్నజాహ్నవిలను ఆధార్ అప్‌డేట్ చేయించాలని చెప్పి సోమవారం సాయంత్రం ఇంట్లోనుంచి తీసుకువెళ్లి వారధిపైనుంచి దూకేశాడు. వీరి ఆచూకీ కోసం మంగళవారం ఉదయం వరకు పలుచోట్ల గాలించారు. మధ్యాహ్నం నుంచి రాజోలు, యలమంచిలి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో దుర్గాప్రసాద్, మోహిత్‌ల మృతదేహాలు లభ్యమయ్యాయి. కుమార్తె జాహ్నవి ఆచూకీ ఇంకా దొరకలేదు. చీకటి పడడంతో పోలీసులు గాలింపు చర్యలు నిలిపివేశారు. కుటుంబ మనస్పర్థల నేపథ్యంలో ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని రాజోలు సీఐ టి.నరేష్‌కుమార్ తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండి వివాదరహితంగా ఉండే దుర్గాప్రసాద్ ఈ నిర్ణయం తీసుకోవడంతో పలువురు విచారం వ్యక్తం చేశారు. తన భర్తతోపాటు కుమార్తె, కుమారుడు కనిపించడం లేదని నాగవేణి ఫిర్యాదు చేసినట్టు మలికిపురం ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు. ఈ సంఘటన మలికిపురం మండలంలోని లక్కవరం, విశ్వేశ్వరాయపురం, బట్టేలంక, కత్తిమండ గ్రామాల్లో సంచలనం రేకెత్తించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.



తండ్రి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్ మృతదేహాలు



శబరిమల స్వాములకు 20 ప్రత్యేక రైళ్లు

- విశాఖ నుంచి సామర్లకోట మీదుగా కొల్లాం



సామర్లకోట, నవంబరు 18(ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసంలో అయ్యప్పస్వామి భక్తుల ప్రయాణ సౌకర్యార్థం విశాఖ నుంచి సామర్లకోట మీదుగా కొల్లాంకు 20ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్టు రైల్వే ఈస్ట్‌కోస్ట్ పీఆర్వో కార్యాలయం నుంచి సామర్లకోట రైల్వేస్టేషన్‌కు ఉత్తర్వులు అందాయి. ఈనెల 18నుంచి జనవరి 21వరకు ఈ ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు ఆ లేఖలో తెలిపారు. ఈ రైళ్లలో ప్రయాణం ద్వారా తమిళనాడులోని పలు ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలను సందర్శించే వీలుంటుందని తెలిపారు.

- నెం.08539 విశాఖ-కొల్లాం మధ్య ప్రతీ మంగళవారం ఉదయం విశాఖలో ఉదయం 8.20కు బయలుదేరి సామర్లకోటకు ఉదయం 10.28కు చేరుకుంటుంది. బుధవారం మధ్యాహ్నం 1.45కు కొల్లాం చేరు తుంది. ఈ ప్రత్యేక రైలు నవంబరు 18, 25, డిసెంబరు 2, 9, 16, 23, 30 జనవరి 6, 13, 20 తేదీల్లో పది ట్రిప్‌లుగా నడువనుంది. ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సామర్లకోటకు 10.28 గంటలకు చేరుకుని, రాజమహేంద్ర వరానికి ఉదయం 11.13కు చేరుకుంటుంది. తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టయ్, సేలం, ఈరోడ్. తిరుప్పూర్, పొడనూర్, పాలక్కాడ్, త్రిచూరు, అలువ, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, తిరువళ్ల, చెంగన్నూర్, కాయంకుళం మీదుగా కొల్లాం మధ్యాహ్నం 1.45గంటలకు చేరుకుంటుంది.
- నెం.08540గల కొల్లాం-విశాఖ మధ్య ప్రతీ బుధవారం సాయంత్రం 5 గంటలకు కొల్లాంలో బయలుదేరి మరుసటిరోజు గురువారంరాత్రి 11గంటలకు విశాఖ చేరుతుంది. ఈ ప్రత్యేక రైలు రాజమహేంద్రవరంనకు సాయంత్రం 6.13కు చేరుకుని, సామర్లకోటకు రాత్రి 7.00 గంటలకు చేరుకుని దువ్వాడ మీదుగా విశాఖకు రాత్రి 11 గంటలకు చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైలు నవంబరు 19, 26 డిసెంబరు 3, 10, 17, 24, 31 జనవరి 7, 14, 21 తేదీలలో పది ట్రిప్‌లుగా నడవనుంది. ఈ రైలులో రిజర్వేషన్ టిక్కెట్ల బుకింగ్‌కు సమీపంలోని రైల్వే బుకింగ్ కార్యాలయాలలో సంప్రదించాలని రైల్వే పీఆర్వో కార్యాలయ అధికారి ఆ ఉత్తర్వుల్లో తెలిపారు.

కరప బీసీ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

పాత ఫర్నీచర్ దగ్ధం

కరప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. అధికారులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక పీహెచ్‌సీ వెనుక జీ+3 భవనంలో బీసీ గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నారు. 213 మంది విద్యార్థులు ఐదు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. భవనానికి కేటాయించిన లిఫ్ట్ జాగా ఖాళీగా ఉండడంతో సిబ్బంది అందులో పాత ఫర్నీచర్‌ను డంప్‌చేశారు. రెండో అంతస్తు వరకూ పేరుకుపోయిన ఈ ఫర్నీచర్ ఒక్కసారిగా తగులబడి భవనంపై వరకూ మంటలు వ్యాపించాయి. అప్పటివరకూ చదువుకుని మూడు అంతస్తుల్లోనూ నిద్రకు ఉపక్రమిస్తున్న విద్యార్థులు ఈ మంటలను చూసి ప్రాణభయంతో కేకలు వేశారు. నైట్ వాచ్‌మెన్, డ్యూటీ టీచర్లు స్పందించి అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. విద్యార్థులను మెట్ల మార్గం ద్వారా కిందకు తీసుకొచ్చారు. కరప ఎస్‌ఐ తోట సునీత, పోలీస్ సిబ్బంది, కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్‌స్టేషన్ నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కాగా అసలు లిఫ్ట్ జాగాలోని పాత ఫర్నీచర్‌కు నిప్పు ఎలా అంటుకుందనే దానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా కాకినాడ జిల్లా బీసీ కళాశాల కన్వీనర్ లోవరాజు మంగళవారం సందర్శించి ఘటనపై విచారణ చేపట్టారు.



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ప్రైవేట్ బస్సు ఢీకొని యువకుడి మృతి

జగ్గంపేట రూరల్, నవంరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే పశ్చిమ గోదావరి జిల్లా తాళ్లపూడి గ్రామానికి చెందిన ఎం.సాయి (27) ఉపాధి నిమిత్తం జగ్గంపేట రూరల్ మామిడాడలో ఇటుక బట్టీ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడికి రెండేళ్ల క్రితం వివాహం కాగా మూడురోజుల క్రితం పాప పుట్టింది. మామిడాడలో పనులు ముగించుకుని స్వగ్రామం తాళ్లపూడి వెళ్తుండగా మామిడాడ శివారుకి వచ్చేసరికి ప్రైవేటు బస్సు ఢీకొనడంతో మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు స్టేషన్ రైటర్ మాణిక్యం తెలిపారు.

యువతిని మోసం చేసిన యువకుడి అరెస్టు

రౌతులపూడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. రౌతులపూడి చెందిన లోవ ప్రసాద్ ఏడేళ్లుగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అవసరాలు తీర్చుకున్నాడు. పెళ్లి చేసుకోమని యువతి రెండేళ్లుగా ప్రసాద్‌ను అడుగుతుండగా చేసుకోనని ముఖంచాటేశాడు. దీంతో ఆమె ఈనెల 7న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం రాత్రి రౌతులపూడిలో శివాలయం వద్ద నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేశారు.

పీఏసీఎస్‌ల బలోపేతానికి కృషిచేయాలి

డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్)లను బలోపేతంచేసేందుకు పర్సన్ ఇన్‌చార్జిలు కృషిచేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి సూచించారు.ఆప్కాబ్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో కాకినాడ డీసీసీబీలో పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలకు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ మంగళవారం కొనసాగింది. సహకార చట్టం, రుణాల మంజూరు, రుణాల రికవరీ, సొసైటీల బైలాపై ఆప్కాబ్ ఫ్యాకల్టీ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సహకార శాఖ అధికారులు, డీసీసీబీ, సొసైటీల సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ద్వారా డీసీసీబీ ప్రగతి పథంలోనికి వస్తుందన్నారు. రెండు రోజుల పాటు జరిగిన శిక్షణలో కాకినాడ జిల్లా నుంచి సుమారు 72 పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు, డీసీసీబీ సీఈవో ప్రవీణ్‌కుమార్, డీపీడీఎం బాపూజీ, డీజీఎం శ్రీధర్ చౌదరి, ఆప్కాబ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపారాధన

- ప్రసన్నాంజనేయుడికి వేదమంత్రాలతో పూజలు
- అలరించిన సినీ సంగీత విభావరి

ద్రాక్షారామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో 62వ కార్తీక దీపారాధన కార్యక్రమం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు వేదపండితుడు జుత్తుక చిన్న ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామికి వేదమంత్రాలతో లక్షతులసి, తమలపాకుల పూజలు చేశారు. స్వామివారిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, తనయుడు సూర్యప్రకాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కార్తీక దీపారాధన మహోత్సవంలో యాంకర్ సోనా వ్యాఖ్యానంతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన ఆకట్టుకుంది. శుభమ్ ఈవెంట్స్ నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు శ్రీకీర్తి, సాయిశిల్ప, ఓంకార్, నజీరుద్దీన్‌షేక్, రసూల్ ఆలపించిన సినీగేయాలు అలరించాయి. 12గంటలకు ఉమాశ్రీ కళానికేతన్ కళాకారులు ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం ఘట్టం, మయసభ, సత్యహరిశ్చంద్ర(వారణాసి)లను రంగస్థల నాటక ప్రియులు ఆసక్తితో తిలకించారు.



ఉష్ట్ర వాహనంపై ఊరేగుతున్న ప్రసన్నాంజనేయస్వామి



సినీగేయాలాపన చేస్తున్న గాయనీ, గాయకులు



డ్రగ్స్‌కు బానిస కావద్దు

అయినవిల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముక్తేశ్వరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ హరికోటిశాస్త్రి మాట్లాడారు. విద్యార్థులు చదువే లక్ష్యంగా ముందుకు సాగాలని, గంజాయి, మద్యం జోలికి వెళ్లవద్దన్నారు.

డిమాండ్ల సాధనకు పోరాట దీక్ష

మామిడికుదురు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): న్యాయపరమైన డిమాండ్ల పరిష్కారానికి ఈనెల24న పోరాట దీక్ష చేస్తున్నట్టు సమగ్రశిక్ష ఉద్యోగులు పేర్కొన్నారు. 24న జరిగే పోరాట దీక్షలో పాల్గొనేందుకు రాష్ట్ర సంఘం పిలుపుతో తమకు క్యాజువల్ లీవల్ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాన్ని ఎంఈవో లక్ష్మీనారాయణకు మంగళవారం అందించారు.

కులమతాలకు అతీతంగా కార్తీక వనసమారాధనలు

అమలాపురం రూరల్ నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కుల మతాలకు అతీతంగా కొంకాపల్లి యువత ఆధ్వర్యంలో మంగళవారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. ప్రతీ గ్రామంలోను ఇదే తరహాలో వన భోజనాలు నిర్వహించి అందరికీ ఆదర్శంగా ఉండాలని పిలుపునిచ్చారు. కుల సమారాధనలు మానుకుని వనసమారాధనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఉసిరి వృక్షం వద్ద కులమతాలకు అతీతంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, ఎంపీటీసీ పనసా బుజ్జి తదితరులు కార్తీక వనసమారాధనలో పాల్గొని కొంకాపల్లి యువత స్ఫూర్తిని రాష్ట్రమంతా వ్యాపింప చే



కొంకాపల్లిలో కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్న స్థానికులు

యాలని పిలుపునిచ్చారు. అమలాపురం దుడ్డు వారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో దేవతిలకుల యువజన సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. కార్తీక దామోదర పూజ నిర్వహించి విద్యార్థులు, మహిళలకు, యువతకు వేర్వేరుగా పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వత్తు మల్లి, రామచంద్రరావు, ప్రధానకార్యదర్శి తుమ్మూరి రామచంద్రరావు (బుజ్జి), కోశాధికారి బి.రవికుమార్ బహుమతులు అందజేశారు. అమలాపురం చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో ప్రముఖ కాంట్రాక్టరు అల్లాడ వెంకటరమణ ఆధ్వర్యంలో వాకర్స్‌క్లబ్ ప్రతినిధులతో కార్తీక వనసమారాధన నిర్వహించారు. కార్తీక దామోదరుని పూజలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, గంధం పల్లంరాజు, మోకా వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం

నష్టపరిహారం చెల్లించాలని ర్యాలీ

యానాం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యానాం శివారు ప్రాంతాల్లో చమురు సంస్థల కార్యకలాపాలతో నష్టపోయిన ప్రజలందరికీ ఓఎన్జీసీ చమురు సంస్థ నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ నాలుగు గ్రామాల ప్రజలు భారీ ఆందోళన చేపట్టారు. ఆగస్టు 22న ఓఎన్జీసీ పైప్‌లైన్ లీకైన ఘటనలో నష్టపరిహారం ఇవ్వాలని 36రోజుల నుంచి దరియాలతిప్పలో రిలే నిరాహార దీక్షలు చేపట్టినా చమురు సంస్థలు స్పందించకపోవడంతో మంగళవారం ఉదయం యానాం శివారు దొమ్మేటిపేట, బాలయోగికాలనీ, దరియాలతిప్ప, సీతారాంనగర్ గ్రామాల ప్రజలు, మహిళలు అధికసంఖ్యలో భారీ ర్యాలీగా తరలి వచ్చారు. స్థానిక పాత బస్టాండ్‌లో అంబేడ్కర్ సర్కిల్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి మున్సిపల్ మాజీ చైర్మన్ గిడ్ల చంద్రరావు, తిరుకోటి నాగేశ్వరరావు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడ నుంచి ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ర్యాలీగా పరిపాలనాధికారి కార్యాలయానికి చేరుకుని అక్కడ ఆందోళన చేశారు. యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. సమస్యలు పరిష్కారించకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈసందర్భంగా నాలుగు గ్రామాల నాయకులు



యానాంలో ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

మాట్లాడుతూ చమురు సంస్థల కార్యకలాపాలతో సమీప గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటివరకు చమురు సంస్థల నుంచి ఎటువంటి స్పందన లేదని, నాలుగు గ్రామాల ప్రజలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకు అధిక సంఖ్యలో తరలిరావడంతో ప్రధాన రహదారి మహిళలతో నిండిపోయింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో ఎస్ఐలు పునీత్‌రాజా, కట్టా సుబ్బరాజు, శేరు నూకరాజులు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గిడ్ల చంద్రరావు, తిరుకోటి నాగేశ్వరరావు, మోకా బుజ్జి, సబ్బతి లోకేశ్వరరావు, గెద్దం వెంకట్రావు, చింతాకులు రామకృష్ణ, మెల్లం చిన్నా, సబ్బతి శ్రీనివాసరావు, ములపర్తి అప్పారావు, నాగేంద్ర, బ్రహ్మం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

‘రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న కేంద్రం’



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అమలాపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకరరావు విమర్శించారు. దళిత, గిరిజన క్రైస్తవ, ముస్లిం మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. జనగణనలోనే కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ అనుబంధంగా ఉన్న బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత బడుగు బలహీనవర్గాలపై వివక్ష, దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు దేశాన్ని తాకట్టు పెట్టే విధంగా మోదీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. ధర్నాలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కొప్పుల సత్తిబాబు, నాయకులు పెద్దిరెడ్డి రాము, శీలం వెంకటేష్, కె.రామకృష్ణ, చెల్లుబోయిన తాతారావు, జి.రవికుమార్, దీపాటి శివప్రసద్, గెద్దం ప్రభాకరరావు, బత్తుల మురళీకృష్ణ, భానోజీ పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా బౌద్ధ స్థూపం



ఆదుర్రులోని ఆదిబౌద్ధ స్థూపాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి , ఎంపీ హరీష్

మామిడికుదురు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆదుర్రులోని ఆదిబౌద్ధ స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం వారు ఆదుర్రు బౌద్ధ స్థూపాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులు తెలుసుకున్నారు. బుద్ధవిహార్ ట్రస్టు కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి బౌద్ధ స్థూపం విశిష్టతను వారికి వివరించారు. సందర్శనకు వచ్చే యాత్రికులకు సదుపాయాలు కల్పించాలని వారి దృష్టికి తెచ్చారు. బౌద్ధ స్థూపాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి కార్యాచరణ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, బళ్ల శ్రీనివాస్, కూటమి నాయకులు బోనం బాబు, మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, మద్దాల కృష్ణమూర్తి, మెండా ఆదినారాయణ, తుండూరు బుజ్జి, మందా గాంధీ పాల్గొన్నారు.

ఐక్యతకు దోహదం

అంబాజీపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ఐకత్యకు దోహదపడతాయని టీడీపీ నాయకురాలు పులపర్తి సుజాత అన్నారు. గంగలకుర్రులో రజక సంఘీ యుల వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రజక సంఘ అమలాపురం తాలూకా అధ్యక్షుడు పేట ఏడుకొండలు, మండల అధ్యక్షుడు నేదునూరి కళ్యాణ్, రజక సంఘ నాయకులు అధికారపు శ్రీనివాసరావు, అధికారపు బాబ్జి, కమిడి అబ్బు, కూళ్ల పనసరామయ్య, పసుపులేటి రామారావు, నేదునూరి గురుప్రసాద్, అధికారపు గురుప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

అమలాపురంరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఓఎస్డీ వెంకటకృష్ణను కలిసిజిల్లా సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర గ్రామ పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లా వెంకటసతీష్‌కుమార్, జిల్లాశాఖ అధ్యక్షుడు గుంట్రు సత్యనారాయణ, నాయకులు నూకల శ్రీనివాస్, అడబాల వెంకన్నాయుడు, కోలా నాగప్రసాద్ వెంకటకృష్ణను కలిసి సమస్యలు వివరించి వినతిపత్రం అందజేశారు.

అధికారుల గైర్హాజరుపై నిరసన

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కాట్రేనికోన, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సమావేశాలకు అధికారులు రాకుండా సిబ్బందిని పంపించడం తమను అవమానించడమేనని ఎంపీటీసీ సభ్యులు నిరసన తెలిపారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన జరిగింది. అధికారుల గైర్హాజరు దీర్ఘకాలంగా జరుగుతున్నా వారిపై చర్యలు లేవని వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, ఎంపీటీసీ సంగాని మునీంద్ర నిరసన తెలిపారు. ప్రతిసారీ తాను నివేదిక పంపిస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీడీవో వెంకటాచలం వివరించారు. మండలంలోని గెజిటెడ్ అధికారులు లబ్ధిదారుల సర్టిఫికెట్లపై సంతకాలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని చెయ్యేరు సర్పంచ్ చెల్లి సురేష్ ఆరోపించారు. ఆధారాలు ధ్రువీకరించుకుని సర్టిఫికెట్లపై సంతకాలు చెయ్యాలని ఎంపీడీవో సూచించారు. ఎంపీపీ ఇంటికి వెళ్లే దారిలో ఆక్రమణలు తొలగిస్తామని తహసీల్దార్ రవికిరణ్ హామీ ఇచ్చారు. రాజకీయ నాయకుల ఇంటి వద్ద సమావేశాలు పెట్టడం ఏమిటంటూ పల్లంకుర్రు సర్పంచ్ నాతి అలివేణి వెలుగు ఏపీవోను నిలదీశారు. మొల్లేటిమొగ హెల్త్ సబ్‌సెంటర్ పనిచెయ్యడం లేదని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఏమి చర్యలు తీసుకున్నారని సర్పంచ్ చెల్లి సురేష్ వైద్యాధికారిని ప్రశ్నించారు. సమావేశాలకు ఆర్అండ్‌బి అధికారులు రాకపోవడాన్ని సభ్యులు నిరసించారు. గెద్దనపల్లి పశువైద్యశాల భవనం ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని సొసైటీ చైర్మన్ వనచర్ల నాగేశ్వరరావు అధికారుల దృష్టికి తెచ్చారు. ఆక్వా చెరువులకు రిజిస్ట్రేషన్ ఉంటేనే రాయితీలు అందుతాయని ఎఫ్‌డీవో చలపతి అన్నారు. తుఫాను వల్ల 1850ఎకరాల్లో సార్వా దెబ్బతిన్నట్టు ఏవో మృదుల తెలిపారు. రెండు నెలల్లో పక్కా గృహాలు మంజూరవుతాయని హౌసింగ్ ఏఈ వేణు తెలిపారు. ఈనెల21లోగా పేర్లు నమోదు చేసేకోవాలన్నారు. సమావేశంలో ఉప్పూడి సర్పంచ్ రంబాల రమేష్, కాట్రేనికోన సొసైటీ చైర్మన్ పెసంగి రంగారావువర్మ, ఎంపీటీసీలు మోకా చంద్రనాగరత్నం, రాయుడు మహాలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం తదితర అధికారులు పాల్గొన్నారు.

రైతుబజార్లలో సరసమైన ధరలకు కూరగాయలు



రైతు బజార్ల ఏర్పాటు కోసం అధికారులతో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మలికిపురం, రాజోలు, సఖినేటిపల్లిలో రైతుబజార్లు ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం విశ్వేశ్వరాయపురంలో ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఎంసీ ద్వారా ప్రాంతాలను గుర్తించాలని ఏఎంసీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లా రైతుబజార్ల అధికారిణి విశాలాక్షితో మాట్లాడుతూ వెంటనే ప్రతిపాదనలు సిద్ధంచేసి కమిషనర్‌కు పంపాలని సూచించారు. నియోజకవర్గంలో బియ్యం అక్రమ రవాణా జరగకుండా సివిల్ సప్లయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అభ్యంతరం లేనిచోట్ల పేదలకు భూములు ఇవ్వడానికి రెవెన్యూ అధికారులు సిద్ధం చేయాలన్నారు. మామిడికుదురులో ఉన్న ఆరు ఎకరాల శ్మశాన భూమిలో ఎకరం భూమిలో 30ఏళ్ల నుంచి ఎస్టీ కులస్తులు నివాసం ఉంటున్నారని వారికి పట్టాలు ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో ఏఎస్పో శరత్, తహశీల్దార్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, భాస్కర్, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి, సూర్యనారాయణ, వీఆర్వోలు తోట శ్రీను, పి.హరికిషన్, కేవీ సత్యనారాయణ, కార్యదర్శులు తాడి ఏసు, బొంతు శ్రీహరి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా ఆకస్మిక తనిఖీ

రాజోలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో జిల్లా ప్రజాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రగతిని ఆయన స్వయంగా పరిశీలించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలను, అమలు జరిగే తీరును గమనించారు. సంగ్రహణాత్మక అసైన్‌మెంట్ అమలుతీరును మూల్యాంకనం అసైన్‌మెంట్ పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో ఎన్‌రోల్మెంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ప్రధానోపాధ్యాయులతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు లైవ్ ప్రోగ్రాం వీక్షించారు. ఎంఈవో ఎస్.మనోహరం, ఎంఈవో-2 టీఎస్కేడీ ప్రసాదరావు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు కె.నరస్వతి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన



నశాముక్త్ ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ మీనా

అమలాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో పోలీసు కార్యాలయంలో మంగళవారం నశా ముక్త్ భారత్ అభియాన్ (మాదక ద్రవ్యాల రహిత భారతదేశ ఉద్యమం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీసు సిబ్బంది, ఎస్పీ కార్యాలయ సిబ్బంది విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారందరితో కలిసి నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞను ఎస్పీ చేయించారు. కార్యక్రమంలో రాహుల్‌మీనాతో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో..

యువత ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యలతో మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. వీటి వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమై మత్తు పదార్థాలకు బానిసలైన వారు నేరచరితులుగా మారుతున్నారని, దీని దృష్ట్యా ప్రతీ ఒక్కరిలోను చైతన్యం పెరిగి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వక్తలు పిలుపునిచ్చారు. కుటుంబాన్ని, సమాజాన్ని సైతం దెబ్బతీసే మత్తు పదార్థాలకు ఎవరూ బానిసలు కావద్దంటూ అమలాపురం మండలం భట్లపాలెంలోని బీవీసీ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులతో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈగల్ సెల్, పోలీసుశాఖతో పాటు వైద్య ఆరోగ్యశాఖ, వివిధ ఎన్జీవో సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నశా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) 5వ వార్షికత్సోవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భారీగా పాల్గొని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేసి, ర్యాలీ చేశారు. అతిథులుగా డాక్టర్ పి.సౌమ్య, సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సుధీర్‌కుమార్, ఉమెన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ గంగాభవానీ, బీవీసీ కళాశాల ప్రిన్సిపాల్ జేవీజీ రామారావు, ఏవో జీవీ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దుర్గారావు, ఫిజికల్ డైరెక్టర్ కె.రవిసుధీర్, వలవల శివరావు, ఎన్ఎంబీఏ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సొసైటీల ద్వారా ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. చిరతపూడి సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సొసైటీ చైర్మన్ రంపం సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం విక్రయించిన రోజుల వ్యవధిలోనే రైతుల ఖాతాలకు ప్రభుత్వం సొమ్మును జమ చేస్తుందన్నారు. అనంతరంబస్తాలో ఉన్న ధాన్యం తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ఎంపీపీ నేతల నాగరాజు, ఏవో ధర్మప్రసాద్, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, సరెళ్ల వెంకటేశ్వర్లు, సభ్యులు బంగారు కామరాజు, కొత్తలంక సుబ్బారావు, సీఈవో పెచ్చెట్టి నారాణమూర్తి, సొసైటీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జిరాయితీ భూముల్లో రోడ్డు నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అల్లవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామంలో తమ జిరాయితీ భూముల్లో రోడ్డు నిర్మాణం జరపడం వల్ల తాము నష్టపోతున్నామని పెచ్చెట్టి సత్యనారాయణ కలెక్టర్‌కు, ఓఎన్జీసీ జనరల్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. ఓఎన్జీసీ ప్లాంటుకు వెళ్లే రోడ్డు నిర్మాణం తమ జిరాయితీ భూముల మీదుగా తమ అనుమతి లేకుండా వేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. తమ భూములను 30ఏళ్లుగా ఓఎన్జీసీ సంస్థకు లీజుకు ఇచ్చామని, తమ కొబ్బరి తోటల్లో చెట్లను తొలగించి ఓఎన్జీసీ భారీ వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. ఓఎన్జీసీ వాహనాలు, ట్యాంకర్ల వల్ల తమ ఇళ్లు బీటలు తీసి దెబ్బతింటున్నాయని పేర్కొంటున్నారు.

అపెక్మా సంయుక్త కార్యదర్శిగా బీవీసీ చైర్‌పర్సన్ కనకదుర్గ



అల్లవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల చైర్‌పర్సన్ బోనం కనకదుర్గ ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్య సంఘం (అపెక్మా) సంయుక్త కార్యదర్శి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనకదుర్గ ఎన్నిక కావడం బీవీసీ సంస్థకు విశిష్ట గౌరవం దక్కిందని పేర్కొన్నారు. బీవీసీ ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, వివిధ విభాగాధిపతులు ఈసందర్భంగా కనకదుర్గకు అభినందనలు తెలిపారు.

సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

అంబాజీపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట సొసైటీ వద్ద 72వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా సొసైటీ చైర్‌పర్సన్ అరిగెల సూరిబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సూరిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. నీటిపారుదలశాఖ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణరావు, జిల్లా కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసర్ డి.విజయలక్ష్మి, కోఆపరేటివ్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, సహకార వారోత్సవాల ఇన్‌చార్జ్ ఆదిమూలం వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

పేదలకు సాయం పంపిణీ

అంతర్వేది, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మోరిలో ప్రభుత్వ సాయం అందక ఎదురుచూస్తున్న 320మంది పేదలకు మాజీ ఎంపీపీ పప్పు లక్ష్మీ సరస్వతి-రమేష్ బియ్యం, కూరగాయలు మంగళవారం పంపిణీ చేశారు. సహకార సంఘ అధ్యక్షుడు వీరా రామారావు, టీడీపీ ప్రధాన కార్యదర్శి తాడి సత్యనారాయణ, మోరి చేనేత సహకార మాజీ అధ్యక్షుడు చింతా వీరభద్రరావు, టీడీపీ గ్రామశాఖ పంగం సుధాకర్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ పేలి గృహోపకరణాలు దగ్ధం

అంబాజీపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):మాచవరంలో మంగళవారం చార్జింగ్‌లో పెట్టిన సెల్‌ఫోన్ పేలి గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. మాచవరం గ్రామపరిధి పోతాయిలంకకు చెందిన మట్టపర్తి యేసు నాగేశ్వరరావు ఇంటిలో ఫోన్ చార్జింగ్ పెట్టి ఉంచాడు. ఆ సమయంలో ఒక్కసారి ఫోన్ పేలిపోయి మంటలు చెలరేగాయి. దీంతో దగ్గరగా ఉన్న వస్తువులు, దుస్తులకు మంటలు వ్యాపించి ఏసీ దగ్ధమైంది. చొక్కా జేబులో ఉన్న రూ.15వేల నగదు, గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి.

ప్రజాదర్బారులో 115 అర్జీలు

అమలాపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక పేరిట ప్రజాదర్బారు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజల నుంచి ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణ రుణాలు, పెన్షన్లు, రోడ్లు, డ్రైన్లు, శ్మశానవాటికల అభివృద్ధి పనులు తదితర అంశాలపై 115వరకు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ పాల్గొన్నారు.



పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్ భూలక్ష్మికి సత్కారం

పి.గన్నవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముంగండ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్ అంబటి భూలక్ష్మిని మంగళవారం పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. సంఘ గౌరవ అధ్యక్షుడు బొడ్డు వెంకట సతీష్, రమ, సంఘ మండల అధ్యక్షుడు పెంటపాటి శ్రీనివాస్, ఆర్యవైశ్య సంఘ ఉమ్మడి జిల్లా మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు బొడ్డు సునీత, సంఘ అధ్యక్షుడు బొడ్డు బదరీనారాయణ, జల్లూరి నాగేశ్వరగుప్త, బొడ్డు వెంకటేశ్వరరావు, బొడ్డు గోపాలకృష్ణ, నూలు రమేష్, బొడ్డు మాణిక్యాలరావు, సర్వేశ్వరరావు, కేదారిశెట్టి ప్రకాశరావు, సుబ్రహ్మణ్యం, నాగబాబు, సూర్యకార్తీక్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

మామిడికుదురు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలి నగరం సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్ పేర్కొన్నారు. సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏ రైతు నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉన్న తన పంటను కనీస మద్దతు ధర కన్నా తక్కువకు అమ్ముకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మట్ట సత్తిబాబు, కాకి శ్రీనివాస్, సీఈవో అడబాల పెద్దిరాజు, అగ్రికల్చర్ అసిస్టెంట్ బొక్కా చంద్రశేఖర్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సొసైటీ వద్ద 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని సహకార జెండాను చైర్మన్ ఆవిష్కరించారు.

వీరేశ్వరునికి లక్షపత్రి పూజ

ఐ.పోలవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీక మాసశివరాత్రి సందర్భంగా మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి మంగళవారం లక్షపత్రి పూజ నిర్వహించారు. పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి, అర్చకుడు యనమండ్ర సుబ్బారావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది. గణపతి పూజ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన జరిగింది. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమీషనర్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి కూసంపూడి సతీష్‌వర్మ దంపతులు మంగళవారం వెండితో తయారు చేసిన సర్పాభరణం కానుకగా సమర్పించారు. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో సంప్రోక్షణ నిర్వహించి స్వామికి అలంకరించారు.

కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు

మలికిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను భీమవరంలో బీజేపీ జిల్లా నాయకులు కలిసి జీడిపప్పు దండతో సత్కరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్, చింతలమోరి సొసైటీ అధ్యక్షుడు దొడ్డా నాగబాబు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో 10కిలోల జీడిపప్పు దండతో మంత్రిని సత్కరించారు. నర్సాపురం నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందుకు కృతజ్ఞతలు తెలిపారు. నర్సాపురం-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రైలుకు జనరల్ బోగీలు రెండు మాత్రమే ఉండడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అదనపు బోగీలుఏర్పాటు చేయించాలని కోరారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే పనులను వేగవంతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించాలని కోరారు.



మారుతీచరణ్ ఆశ్రమంలో వనసమారాధన

అయినవిల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాగాంలోని శ్రీస్వామిమారుతీచరణ్ ఆశ్రమంలో మంగళవారం ఆధ్యాత్మిక మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. 42ఏళ్లుగా బ్రహ్మచారి మారుతీచరణ్‌స్వామి నేతృత్వంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. వేల సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిభక్తి సేవా సత్సంగాల్లో పాల్గొన్నారు. రామానుజభారతీస్వామి సత్సంగంలో వనసమారాధన విశిష్టతను వివరించారు. గాయత్రీ పీఠం నిర్వాహకులు ఆకుల శ్రీదేవి, వేటుకూరి అబ్బురాజు, సూర్యకాంతం, మునుకోటి నాగబాబు-నాగమణి దంపతులు, ఓలేటి సుందరశివరావు, కొమ్మిరెడ్డి నారాయణరావు, వేటుకూరి బంగారి, యెరుబండి దొరబాబు పాల్గొన్నారు.

నందంపూడిలో బాలిక కిడ్నాప్ కలకలం

స్థానికులు కేకలు వేయడంతో పరారైనట్లు సమాచారం

అంబాజీపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నందంపూడిలో బాలికను బొలేరా వాహనంలో ఇద్దరు వచ్చి కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారంటూ సోషల్‌మీడియాలో హల్‌చల్ చేసింది. నందంపూడి ప్రాథమిక పాఠశాలలో ఆ గ్రామానికి చెందిన బాలిక 4వ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు బొలేరా వాహనంలో వచ్చి పాఠశాల అయిన తరువాత ఇంటికి వెళ్తున్న ఆ బాలికను పట్టుకుని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో బాలిక వారికి దొరకకుండా కిందకు ఉండిపోయి పెద్దగా కేకలు వేసిందని, స్థానికులు గట్టిగా కేకలు వేయడంతో వారు పరారయ్యాయరన్నారని తెలిపారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

శివాలయాల్లో లక్ష బిల్వార్చనలు

అల్లవరం, నవంబరు18(ఆంధ్రజ్యోతి):అల్లవరం ఉమామల్లేశ్వరాలయంలో మంగళవారం లక్ష బిల్వార్చన పూజలు జరిగాయి. అనపిండి సుబ్రహ్మణ్యశర్మ బ్రహ్మత్వాన మూలల లక్ష్మీనరసింహం సోదరులు కర్తలుగా లక్ష బిల్వార్చన, కుంకుమ పూజలు జరిగాయి. రామేశ్వరం శివాలయంలో చైర్మన్ అంగానిరామారావు ఆధ్వర్యంలో, బోడసకుర్రు గౌతమేశ్వరాలయం, లక్ష్మణేశ్వరం, బెండమూర్లంక, గోడి, గోడిలంక, కొమరగిరిపట్నం, దేవగుప్తం, యెంట్రుకోన, తాడికోన శివాలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై సర్పంచ్‌లకు శిక్షణ

ఉప్పలగుప్తం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో జి.కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచ్‌లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ పరిధిలో వ్యర్థాలను ఎలా ఉపయోగించుకోవాలన్న అంశంపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు నిషేధమంటున్న ప్రభుత్వం వాటి తయారీని నిరోధించకుండా దుకాణదారులపై చర్యలు తీసుకోవడం ఎంతవరకు సబబమని పలువురు సర్పంచ్‌లు ప్రశ్నించారు. గ్రామాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దే ప్రయత్నంలో సర్పంచ్ కీలక పాత్ర పోషించాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, పాలనాధికారి బీసీహెచ్ తులసీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరు మండలం మడికి వద్ద హైవే సర్వీసు రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

నష్టపోతున్న వారికి న్యాయం చేస్తాం

సర్వీసు రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించిన ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హైవే 216(ఎ) సర్వీసు రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్న బాధితులకు న్యాయం చేస్తామని కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అన్నారు. మడికి నుంచి చొప్పెల్ల వరకు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయనే ఉద్దేశంతో హైవే అధికారులు సర్వీసు రోడ్డును ప్రతిపాదించారు. ఇందులో భాగంగా మడికి కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల వరకు సర్వీసు రోడ్డు పనులు ప్రారంభించారు. మంగళవారం ఆర్డీవో శ్రీకర్ చెముడులంక వద్ద షాపులు, ఇళ్ల తొలగింపులను పరిశీలించారు. ఈసందర్భంగా బాధితులు సర్వీసు రోడ్డు నిర్మించడం వల్ల తమకు అన్యాయం జరుగుతున్నదని బాధితులు మొరపెట్టుకున్నారు. గతంలోనే భూసేకరణ జరిగిందని అప్పట్లో వదిలేయడంతో ఆక్రమణలు జరిగాయని హైవే అధికారులు చెబుతున్నారు. ఆక్రమణలు ఉంటే తొలగిస్తామని, రెవెన్యూ రికార్డుల ప్రకారం మార్కింగ్ ఇస్తామన్నారు. భూసేకరణ చేయాల్సి వస్తే వారికి పరిహారం చెల్లిస్తామని ఆర్డీవో తెలిపారు.

డివైడర్‌ను మంజూరు చేయండి
ఆర్డీవోకు రైతుల వినతి

చెముడులంక వద్ద హైవేపై డివైడర్ లేక ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు అన్నారు. ఇక్కడ డివైడర్‌ను ఏర్పాటు చేయాలని ఆర్డీవో శ్రీకర్‌కు పలువురు రైతులు కోరారు. హైవే అధికారుల దృష్టికి దీన్ని తీసుకెళ్లి డివైడర్ వచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.



ప్రసన్నాంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న ఎంపీ బోస్ తదితరులు

ఘనంగా కార్తీక దీపారాధనోత్సవం

ద్రాక్షారామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో 62వ కార్తీక దీపారాధనను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రసన్నాంజనేయ స్వామికి వేదమంత్రాలతో పలు పూజలు చేశారు.

ఉష్ట్ర వాహనంపై నగరోత్సవం: మధ్యాహ్నం ప్రసన్నాంజనేయస్వామికి ఉష్ట్ర వాహనంపై మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో నగరోత్సవం జరిపారు. రాజ్యసభ సభ్యుడు బోస్, వైసీపీ కోఆర్డినేటర్ సూర్యప్రకాష్ దీన్ని ప్రారంభించారు. కోలాట నృత్యం, మంగళ వాయిద్యాలతో ఉష్ట్ర వాహనంపై ప్రసన్నాంజనేయస్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు అక్కిరెడ్డి అబ్బు బృందంచే భజన కార్యక్రమాలు జరిపారు.

జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్సీ తోట దంపతులు: సాయంత్రం 5.24 గంటలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక దీపారాధన ప్రారంభించారు. అఖండ దీపాన్ని వారు వెలిగించారు. అంతకు ముందు ప్రసన్నాంజనేయస్వామికి పూజలు జరిపారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీను, వ్యాపారవేత్త సత్తి సుబ్బారెడ్డి, సమాజం సభ్యులు పాల్గొన్నారు.

బాణసంచా మెరుపులు: కార్యక్రమంలో భాగంగా రాత్రి 10 గంటలకు సాయిదుర్గా ఫైర్‌వర్క్సు ఎన్. సత్తిబాబుచే బాణసంచా కార్యక్రమం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. రామచంద్రపురం డీఎస్పీ ఎన్.రఘువీర్ పర్యవేక్షణలో సీఐలు ఎంవీ నారాయణ, దొరరాజు పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఆక్రమణ చెరలో రామచంద్రుడు డెడికేటెడ్ చానల్

• పట్టించుకోని ఇరిగేషన్‌శాఖ అధికారులు • రైతులకు సాగునీటి కోసం తప్పని తిప్పలు

మండపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండపేటలో వున్న రామచంద్రుడు డెడికేటెడ్ చానల్ ఆక్రమణలకు గురవుతున్నా ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. తాపేశ్వరం లాకుల నుంచి మండపేట ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ కాల్వలో మున్సిపాలిటీకి చెందిన మురుగునీరు కలిసిపోవడంతోపాటు, ఇళ్లల్లో వాడే వాడకంనీరు సాగునీటిలో కలిసిపోవటంతో రైతులు సాగునీరు పెట్టుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాల్వ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. ఇక్కడ కాల్వ దుస్థితిపై ఇరిగేషన్‌శాఖ అధికారులు పట్టించు కోకపోవ టంతో ఆయకట్టు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రామచంద్రుడు డెడికేటెడ్ చానల్ కాల్వ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వ్యర్థాలతో నిండిపోయిన డెడికేటెడ్ చానల్

కాల్వలోని వ్యర్థాలు, గుర్రపు డెక్కను తొలగించి సాగు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ద్రాక్షారామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన అంశంపై ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎంవీ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలో ప్రవేశాలకు
దరఖాస్తు చేసుకోండి

కొత్తపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు సోమవారం నుంచి 20వ తేదీ వరకూ జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. తమ కళాశాలలో బీఏ ఏకనామిక్స్, బీఏ పొలిటికల్ సైన్సు, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, బీఎస్సీ జువాలజీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాజు కోరారు.



వాడపల్లి ఆలయంలోని అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

వాడపల్లి ఆలయ అభివృద్ధి
పనుల పరిశీలన

ఆత్రేయపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆర్డీవో శ్రీకర్, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వకుళమాత అన్నదాన భవన నిర్మాణం, కోనేరు అభివృద్ధి పనులు, క్యూలైన్ల ఏర్పాటును వారు పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలమూరు జనార్దనస్వామి ఆలయానికి జనరేటర్ బహూకరిస్తున్న దాత

ఆలయానికి జనరేటర్
బహూకరణ

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరు జనార్దనస్వామి ఆలయానికి దాత జనరేటర్ బహూకరించారు. గ్రామానికి చెందిన కామవరపు సత్యసుబ్రహ్మణ్యశర్మ కాశీఅన్నపూర్ణ దంపతులు మంగళవారం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, అర్చకులు ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవాన్‌ల సమక్షంలో దీన్ని అందించారు.

గోఆధారిత ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గోఆధారిత ప్రకృతి వ్యవసాయం ప్రజలకు, పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. అంకంపాలెంలో గ్రామవికాస్ ఆంధ్రప్రదేశ్, వ్యవసాయ శాఖ, ప్రకృతి రైతు కుడప కృష్ణమూర్తి సంయుక్త ఆధ్వర్యంలో గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సదస్సు నిర్వహించారు. దీనికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ సేవల దేవదత్తు, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు పాల్గొన్నారు. ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన గోఆధారిత సేంద్రియ ఉత్పత్తుల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యానందరావు మాట్లాడారు. ఆహారం పైనే ఆరోగ్యం ఆధారపడి ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వమే ప్రత్యేకంగా ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. నియోజకవర్గ స్థాయి కమిటీ చైర్మన్‌గా కె.కృష్ణమూర్తిని నియమించి మండలాల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. రావులపాలెం, కొత్తపేటలలో ఈ ఉత్పత్తుల రిటైల్ దుకాణాలు ప్రారంభించే దిశగా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ప్రకృతి వ్యవసాయ సలహాదారులు బొప్పన సీతారామదాసు, ఏపీసీఎన్ఎఫ్ పీఎంలు కొత్తపల్లి శ్రీనివాసు, బొర్రా తాతారావు, జె.ఎలియాజర్, కృషివల కోకోనట్ ఫార్మర్స్ ప్రోడ్యూసర్స్ కంపెనీ సీఈవో అడ్డాల గోపాలకృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



అంకంపాలెంలో ప్రకృతి రైతు కృష్ణమూర్తికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, రెడ్డి సుబ్రహ్మణ్యం



రామచంద్రపురంలో రన్ ఫర్ యూనిటీ ర్యాలీ నిర్వహించిన దృశ్యం

ఆకట్టుకున్న రన్ ఫర్ యూనిటీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రామచంద్రపురంలో బీజేపీ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. రన్ ఫర్ యూనిటీని టీడీపీ నేత వాసంశెట్టి సత్యం ప్రారంభించారు. మోడరన్ విద్యా సంస్థల వద్ద నుంచి మెయిన్ రోడ్డు వరకు రన్ ఫర్ యూనిటీ జరిగింది. ఇందులో భాగంగా 500 అడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు ప్రదర్శన జరిపారు. ముందుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వాసంశెట్టి సత్యం సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహానికి నివాళులర్పించారు. రన్ ఫర్ యూనిటీ అనంతరం కూటమి నాయకులు, విద్యార్థులు స్వదేశీ సంకల్ప ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, ఉపాధ్యక్షురాలు శ్రీదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టువాడ హరిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, బీజేపీ నాయకులు యాండ్ర బుల్లబ్బులు, సలాది శేఖర్, రామమూర్తి, రామవేంద్ర, సలాది సతీష్‌నాయుడు, మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా
మంగారావు

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల డిప్యూటీ తహశీల్దార్‌గా డి.మంగారావును నియమించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తూ డిప్యూటేషన్‌పై అమలాపురం కలెక్టరేట్‌లో పనిచేస్తున్న సుబ్బరాజు స్థానంలో ఆలమూరు మండల రీసర్వే డీటీగా పనిచేస్తున్న మంగారావును డిప్యూటీ తహశీల్దార్‌గా నియమించగా, మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నేడు అన్నదాత సుఖీభవ పంపిణీ

రాయవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయవరం కంటిపూడి సీతారత్నం ఫంక్షన్ హాల్‌లో బుధవారం అన్నదాత సుఖీభవ 2వ విడత, పీఎం కిసాన్ 21వ విడత నిధుల పంపిణీ నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఏవో మాట్లాడుతూ మండపేట నియోజకవర్గ స్థాయిలో మూడు మండలాల రైతులకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా మధ్యాహ్నం నిధుల పంపిణీ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాలకు చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.





కె.గంగవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జానీబాషా. పక్క చిత్రంలో రావులపాలెంలో సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మత్తు పదార్థాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలి

రావులపాలెం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని రావులపాలెం టౌన్ సీఐ ఎం.శేఖర్‌బాబు అన్నారు. రావులపాలెం పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మత్తు పదార్థాల వినియోగాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ప్రతిజ్ఞ చేయించారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

కె.గంగవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని పామర్రు ఎస్ఐ ఎస్.కె.జానీబాషా అన్నారు. మంగళవారం ఆయన కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవీఎస్ సుబ్రహ్మణ్యం, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు, యువత దూరంగా ఉండాలి

రాయవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాయవరం ఎస్ఐ డి.సురేష్ బాబు సూచించారు. మంగళవారం రాయవరం సాయితేజ స్కూల్‌లో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మత్తు పదార్థాలపై సమాచారం ఉంటే వెంటనే 1972కు తెలియజేయాలన్నారు. విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రమాణం చేయించారు. అనంతరం డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులతో రాయవరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ డి.రాంబాబు, పాఠశాల అకడమిక్ డైరెక్టర్లు కర్రి భానురేఖ, సందీప్‌రెడ్డి, కానిస్టేబుల్ శ్రీను, సాయి, సాయితేజ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాయవరంలో డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ, విద్యార్థులు

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం

కపిలేశ్వరపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు అన్నారు. అంగర శ్రీ సిద్దార్థ కళాశాలలో మంగళవారం డ్రగ్స్ దుష్ప్రభావాలపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ వాకా పరమేశ్వరరావు అధ్యక్షతన అంగర ఎస్సై జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. అనంతరం సిద్దార్థ కళాశాల డైరెక్టర్ పరమేశ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అంగర గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి గాంధీ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ హరీష్‌కుమార్, ప్రిన్సిపాల్ పి.రమణ, అధ్యాపకులు ఎస్ఎస్‌వి శ్రీనివాస్, కె.పరదేశి, ఎం.తమ్మిరాజు, ఎ.శ్రీనివాస్ తదితరులతో పాటు పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట కాలువలో
గుర్తు తెలియని మృతదేహం

కొత్తపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పలివెల-అమలాపురం ప్రధాన పంటకాలువలో కొత్తపేట గోగివారిపేట వంతెన సమీపంలో సుమారు 45 ఏళ్ల వయ్యసు కలిగిన గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. మృతుడి కుడిచేతిపై అనంతపవన్‌కుమార్ అని పచ్చబొట్టు ఉందన్నారు. మృతదేహన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్టు ఎస్ఐ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్ నెంబర్ 94409 04842, రావులపాలెం రూరల్ సీఐ 9440796527 ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కపిలేశ్వరపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజు మంగళవారం గ్రంథాలయ అధికారిణి డి.శివకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సర్పంచ్ సాకా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్, గ్రంథాలయ అధికారిణి శివకుమారి మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానవంతులు కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ అబ్బులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాటన్ విగ్రహావిష్కరణ

ఆలమూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్‌ఆర్థర్ కాటన్‌దొర చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. సందిపూడిలోని కాలువ వద్ద దొడ్డా సత్తిబాబు ఏర్పాటు చేసిన కాటన్ విగ్రహాన్ని మంగళవారం ఆధ్యాత్మికవేత్త అడపా భాస్కరరామ్మూర్తి ఆవిష్కరించారు. ధవళేశ్వరం వద్ద బ్యారేజ్ నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన ఆయన కృషి అభినందనీయమన్నారు. ఇటువంటి మహనీయుడి విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కాటన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దాత సత్తిపండు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.



కాటన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

ఘనంగా కార్తీకమాస వనసమారాధనలు

కపిలేశ్వరపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర, వెదురుమూడిలో మంగళవారం కార్తీకమాసం సందర్భంగా వన సమారాధనలు జరిగాయి. ఈ సందర్భంగా అంగరలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో తులసి, ఉసిరిచెట్టు కింద ఆలయ అభివృద్ధి కమిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం వనసమారాధన జరిపారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వెదురుమూడిలో విజయనగరం జోనల్ ఆర్టీసీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు నెక్కంటి బాలకృష్ణ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన జరిగింది. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఎక్కడా అసౌకర్యం తలెత్తకుండా నిర్వాహకులు చర్యలు చేపట్టారు.



కపిలేశ్వరపురంలో జరిగిన గ్రామసభలో గుర్తించిన పనులను వివరిస్తున్న దృశ్యం

జాబ్‌కార్డుదారులంతా
ఈకేవైసీ చేయించుకోవాలి

కపిలేశ్వరపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పని చేసే జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతిఒక్కరు ఈకేవైసీ చేయించుకోవాలని కపిలేశ్వరపురం గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జ్ ఏపీవో రంజిత్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ అధ్యక్షతన ఉపాధి గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 47 ఉపాధి పనులను గుర్తించినట్లు ఏపీవో రంజిత్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొక్కా రాంబాబు, కార్యదర్శి కె.శివచక్రవర్తి, ఉపాధి కూలీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షపత్రిపూజ



పూజలు నిర్వహిస్తున్న పండితులు

కపిలేశ్వరపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఏటిగట్టు సమీపంలోనున్న శ్రీ అగస్తేశ్వర పాపవినాశేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్షపత్రిపూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్, పురోహితులు యేణ్బాతుల వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వై.కిరణ్ శర్మ తదితర పండితులు పాల్గొని స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్షపత్రిపూజను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నాయకుడి మృతికి సంతాపం

మండపేట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) పాతతరం కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు బండారు లక్ష్మణస్వామి(102) మంగళవారం కన్ను మూశారు. తొలితరానికి చెందిన ఈయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు వున్నారు. ఇటీవల భార్య, కుమారుడు మరణించారు. ఆయన మృతికి స్థానిక నేతలు పలువురు సంతాపం తెలిపారు.



ఆలయ నిర్మాణ కమిటీకి విరాళం అందజేస్తున్న సత్యవతి కుటుంబ సభ్యులు

సుందరపల్లి శివాలయం నిర్మాణానికి విరాళం

కె.గంగవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరపల్లి గ్రామంలోనున్న ఉమా సమేత సోమేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి వల్లూరి సత్యనారాయణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.2,00116 విరాళంగా అందజేశారు. మంగళవారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు ఎస్.సత్తిబాబుకు వారు నగదు అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అభినందించారు.